# వింత వివాహము

బంకుపల్లి సూర్యశాస్త్రిగారు

అది మాఘమాసం. రథసప్తమి వెళ్లి రెండురోజులే అవడముచేత మలయమారుతం హాయిగా వీస్తుఉంది. 'పరిమళం' అప్పుడె భోజనంచేసి చావడీలోకొచ్చింది. గోడకు దాపిన సరస్వతీపటము వెనుక మామూలు ప్రకారంపెట్టిన గృహలక్ష్మి పత్రిక తీసి చదువుతూ మంచంమీద చేరబడింది.

ఎదురుగాఉన్న యింట్లో "సమీరు' కుర్చీలో కూర్చొని కళ్లజోడుసర్దుకుంటూ తన విద్వాన్ పరీక్షాపుస్తకాలు చదువుకుంటూఉన్నాడు. తల పైకెత్తిచూచేసరికి ఎడమవైపున్న పరిమళంయొక్క సుందరవదనం కనిపించింది. సమీరు తనహృదయాన్ని ఇన్నాళ్ళకు ఆమెపరంచేశాడు. దృష్టికూడ పరిమళంమీద లగ్నమయిపోయింది.

పరిమళానికి ఆచూపులు విసుగుకలిగించేయి. అదివరకెప్పుడు సమీరు అల్లా చూడకపోవడంచేత కోపంకూడ ఒచ్చింది. కొంతసేపటికి ఈర్ష్య తెచ్చుకొని తనచేతిలో ఉన్న గృహలక్ష్మి పత్రికను మంచంమీద పడవేసి చావట్లోంచి వెళ్ళిపోయింది.

సమీరు ఖిన్నుడై పోయేడు కాని ఒక్కొక్కమారు ఎంచేతనో ఒళ్లుపులకరిస్తుఉండేది. పరిమళం పెంకితనం జ్ఞాపకం తెచ్చుకొని ఒక్కొకమారు కోపం దుఃఖంకూడ తెచ్చుకుండేవాడు. మొత్తంమీద ఇదివరకున్న మనశ్శాంతి ఇప్పుడులేదు చదువుతూవున్న పరీక్షాపుస్తకాలు తలకెక్కడంలేదు.

## ౨

పరిమళానికి యిరువదియైదు సంవత్సరాలుంటాయి. మందారపువ్వులాంటియావ్వనం, యావ్వనంతోపాటు వైధవ్యవ్యధకూడ ఆవేశించింది. రోజురోజు జీవితం యెడారై పోతూంది. "జీవితంలో నాకు విశ్రాంతిలేదు. కాబోలు!" అని అనుకుంటూ ఉండేది. కాని ఎప్పుడూ గృహలక్ష్మి భారతి మొదలయిన పత్రికలు చదవడంచేతనూ సమీరు ఇల్లు యున్నచేతనూ హృదయవిశ్రాంతి కల్పించుకుంటూ ఇప్పుడిప్పుడు భావాలు మార్చుకుంటూ ఉన్నట్టు అగుపడుతూఉంది. పాటలంటే చాలయిష్టము. పాటలుపాడిన ఆడపిల్లల్ని చూస్తె చాల ఆదరిస్తుంది. తననోటుపుస్తకంలో ఎన్నోపాటలు రాసుకుంది. ఎప్పుడూ ఆడుతూపాడుతూ సంతోషంతో పవిత్రంగానే కాలంగడుపుతూఉంది.

పరిమళం తండ్రి శ్యామలరావుపంతులు గవర్నమెంటుపెన్షనుదారు. పూర్వాచారపరాయణుడుకాడు గాని స్వతంత్రభావాలు లేనివాడు.

సమీరుపన్ను గడలకే మాత్రం తీసిపోడు. ఎలాగైనా తనకోరిక సఫలం చేసుకుందా మనుకున్నాడు.

౩

మర్నాడు పదిగంటలయింది. మామూలు ప్రకారం పరిమళం భోజనంచేసి ముందుచావడిలో కొచ్చింది. పటంవెనకనున్న పుస్తకం తీస్తు సమీరుమీదికి తనకడకంటి సెర్చిలైటు ఫోకస్ చేసింది.

తమాషాచేద్దామని "ఇదిగో!" అని తన మధురకోకిలస్వరంతో కూసి చాటుకెళ్లి దాగుంది. భావతరంగాల్లో తేల్తూ ఉన్న సమీరు హృదయనావకు లంగరు అందలేదు. తానేంచెయ్యాలో తనకు తెలియలేదు. కాని అతడేంచేస్తున్నాడో చూద్దామని పరిమళం కిటికీలోంచి కొంచెం తలపైకెత్తింది. సమీరు ఏమీ ఎరుగనట్టు తలవంచుకొని పుస్తకం చదువుతున్నట్టు నటిస్తు పరిమళంయొక్క వదనకమలం పూర్తిగ గోచరమయ్యేక "ఓహో" అని పక్కున నవ్వేడు. పరిమళం కోపమువచ్చినట్టు వేడిగ సమీరువేపుచూస్తూ గబగబనడచి వంటింటికెళ్లిపోయింది. "నాకేనా కోపంరానిది" అని సమీరు వీధితలుపులు గభాలున మూసేశాడు.

౪

ఆరాత్రి సమీరు కసలునిద్రపట్టలేదు. "పరిమళానికి నామీద నిజంగా ప్రేముందా లేదా? లేక ఇదంతా కొంటెతనమా?

అంతలోకెనవ్వు... ..అంతలోకేకోపం.... కొంటెతనముంటే ఉందిగాని అందులో వ్యక్తిత్వంకూడ ఉంది.

పరిమళాన్ని విడచి క్షణమేనా ఉండగలనా? అయ్యో ఉండడమే! విడచి బ్రతుకడమే! నా జీవితం జీర్ణారణ్యంకాదూ! పరిమళం! నా జీవితం నిష్ఫలంచేస్తావా?" అని ఈవిధమయిన మోహాందోళన తప్ప మరొక ఆలోచనకు సమీరు హృదయంలో తావులేదు.

నిద్రలోకూడ పరిమళంవదనకమలమే ప్రత్యక్షం. హృదయేశ్వరి మందగమనంతో సమీపించి ఆలింగనంచేయబోయినట్టు కలొచ్చింది. ఇంకేమిజరుగునోగాని అంతట్లో గదిలో ఏదో చప్పుడైన చట్టున మెలకువొచ్చింది. దిగ్గునలేచి చూచెసరికి పరిమళం లేదు. పరిమళం వాయువులో లీనమైపోయింది. తుదకు విషవాయువైపోయింది పరిమళం. మరి ఒక్కకునుకైనా లేదు.

వెంటనే ఫైల్ తీశాడు. స్వప్నమంతా చిత్రించికథగారాద్దామనుకున్నాడు. చిన్నెలు వన్నెలుపెట్టి కథపూర్తిచేసేసరికి రెండుగంటలు రాత్రయింది.

ఉదయాన్నె సమీరుకనబడలేదు. నిన్నటి వేడి వేడిచూపులు ప్రియునిమనస్సు విరిచేశాయేమో అని పరిమళానికి బెంగకలిగింది. రోజు సంతోషంగాతిరిగే పరిమళం ఆనాడు కొన దిరిగి స్తంభానికి చేరబడికూర్చొంది.

౫

సమీరుకథను పరిమళానికి చూపించాలని అనుకున్నాడు. ఒకవేళ యీకథశ్యామల

రావుపంతులు కంటపడితే అసలుకే మోస మొస్తుందేమో అని అనుకున్నాడు. ఆ కథ కాగితం ఇంట్లో ఉంచేశి ఉత్తచేతులతో వీధిలో కొచ్చేడు. శ్యామలరావు పంతులుతో మాట్లాడదామని కల్పించుకొని అతనింటికి వెళ్లేడు.

సమీరుని చూడగానే పరిమళానికి వల్ల మాలినసిగ్గు కలిగింది.

పైట సవరించుకుంటూ ముసిముసినవ్వుతో పాటలపుస్తకం తెరుచుకొని కలంతో ఒక్కొక్కపాట రాసుకుంటూ కూర్చుంది. సమీరు నిజంగా మాట్లాడడానికి వెళ్లలేదు. కాని ఏదో కొంతసేపు శ్యామలరావు పంతులుతో మాట్లాడి తిరిగి ఇంటికెళ్లుతు ఉంటె పరిమళం ఎదురైంది.

౬

"పరిమళం! కాస్తమంచినీరిస్తావ్?" అన్నాడు సమీరు. పరిమళం తెచ్చిన నీళ్లు త్రాగేడు. "ఇంతతియ్యగా ఉన్నాయేం నువ్వుదెచ్చిన నీళ్లు?" అన్నాడు. "ఆతీపినీళ్లలో లేదు" అంది నవ్వుతూ

"అవునుగాని మాయింటికోసారిఒస్తావ్?"

"ఎందుకూ"

"ఒకగమ్మత్తు చూపిస్తా!"

"ఏమిటి?"

'ఒస్తెగాని చెప్పను"

"చూపిస్తెగాని రాను"

"బలేటక్కరివే"

"సరిగాని చెప్పవోయ్"

"కథ"

"కాదు చెపుదూ" అంది.

"అబ్బ!!"

"అయితె నేనురాను"

"అయితె విను. నీమీదకలొచ్చింది రాత్రి"

"అయితె కథ రాశేవేమిటి అకల?"

"ఆ, అట్లాంటిదే జరిగింది"

"ఏమనొచ్చిందికల?"

"తినబోయిరుచులెందుకూ అడగడం?"

"ముందు తెలుసుకుంటే మనసూర్తిగా తినొచ్చునని"

వీళ్ల కబుర్లు శ్యామలరావుపంతులుకి విని పించేయి. ఏమిటో చూద్దామని తలుపుతీసే సరికి తోడిదొంగలిద్దరు ప్రత్యేక్షమయ్యేరు.

ముఖం ప్రక్కకుత్రిప్పి నవ్వుకుంటూ నిల బడ్డాడు సమీరు.

పరిమళంసిగ్గుతో దాగుంది. పాపం శ్యామలరావుపంతులు ఏంచేస్తాడు?ఏవో గొనుగుకుంటూ గదిలో కెళ్లిపోయ్యేడు.

పరిమళంఒచ్చేక "విన్నారు చివరకు మన కథంతా" అన్నాడు సమీరు.

"పరవాలేదు. సాయింత్రం రానా?" అంది.

"ఆ ఆరుగంటలకి"

"ఆ"

సమీరు హృదయభారంతగ్గింది. పరిమళం మాటలు తలుచుకుంటూ నూతన వికాసంతో షికారువెళ్లిపోయేడు.

౭

అనుకున్న వేళకు పరిమళం సమీరింటికి బయల్దేరింది.

సమీరు తనగదిలో సంధ్యచీకట్లో ఆలోచిస్తు కూచున్నాడు. ఆలోచన ఆరోగంట మీద; ఇంతలో ఎవరో వెనుకనుంచి కళ్లు మూసేశారు. ఉలికిపడి విడిపించుకోడానికి వెనకకు చేతులుచాచి ఆ చేతులు గట్టిగ పట్టుకున్నాడు సమీరు.

"ఇదంతా పరీక్ష చదువేనా?" అంది నవ్వుతూ పరిమళం.

సమీరు కథతీశాడు. "ఇదిగో! నీకు చూపిస్తానన్నది."

"స్వప్నగాథా?" అంది.

"మనవిలాసగాథ"

పరిమళం ప్రియునిలో పూర్తిగా లీనమయి పోయింది. తన్మయురాలై లోకం మరిచి పోయింది.

౮

రాత్రి భోజనమయ్యేక శ్యామలరావు పరిమళాన్ని పిలిచి "పరిమళం, నీవరస బొత్తిగ బాగులేదుసుమా?" అన్నాడు.

పరిమళం నవ్వుతూ "ఏంనాన్న" అంది.

"ఇదేమిటిల్లా అదురుబెదురూ లేకుండా." అన్నాడు కోపంతో.

పరిమళం తలవంచుకొని కాలి బొటన వ్రేలితో నేలమీదరాస్తూ కన్నీళ్లు కారుస్తూ నిలబడి నీరైపోయింది.

ఆరాత్రి ఏవేవో మాటలు చాలచాల అన్నాడు తండ్రి.........

ఆరాత్రి తొలిఝాము ఎల్లాగో గడిపింది. తెల్లవారుసరికి పరిమళం ఇంట్లో లేదు. సమీరు ఊళ్లో లేడు.

ఆరోజు గడిచిపోయింది. రెండోరోజు కూడ గడిచింది. మూడోరోజు వచ్చింది. సమీరు పరిమళాల జాడైనా లేదు. నాలవ నాడు ఉదయం శ్యామలరావుపంతులుపేర ఒకకార్డు వచ్చింది.

అందులో:—

"నాన్నగారికి,

నమస్కారములు. నేను సమీరుని పెళ్లి చేసుకున్నాను. మా ప్రేమప్రవాహాన్ని మానవమాత్రుడు అడ్డలేడని నేను సాహసించి చెప్పగలను. ఇదిఒక పవిత్రమయిన ప్రేమారాధన. అమానుషమయిన అకృత్యము కాదు.

ఇట్లు మీ ప్రియపుత్రిక,

"పరిమళం"

—